క్లుప్తంగా

మణిపూర్‌లో శాంతి భద్రతలు నెలకొల్పాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పాస్టర్స్, సర్పంచ్ చిన్నవరాజు

ఉప్పలగుప్తం: మణిపూర్‌లో శాంతి భద్రతలు నెలకొల్పి స్త్రీలకు రక్షణ కల్పించాలని గొల్లవిల్లి నుంచి ఉప్పలగుప్తం వరకూ యూసీఏ పాస్టర్స్ ఆధ్వర్యంలో మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మండల యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు గెద్దం లాజర్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించి తహసీల్దార్ వెంకటేశ్వరికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు, సాపే డేవిడ్, కరాటం శామ్యూల్, వాకపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించాలి

ఐ.పోలవరం: వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించాలని విద్యుత్‌శాఖ ఏఈ సోమేశ్వరరావు మంగళవారం తెలిపారు. మీటరు రీడింగ్ తీసిన 15 రోజుల్లోగా బిల్లులు చెల్లిస్తే ఎలాంటి అపరాధ రుసుము విధించరన్నారు. నెల రోజులు దాటిన తర్వాత కూడా బిల్లు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని, తదుపరి రీకనెక్షన్‌కు అదనంగా రూ.100 చార్జి చెల్లించవలసి ఉంటుందన్నారు. విద్యుత్ బిల్లులను నేరుగా విద్యుత్ రెవెన్యూ కార్యాలయం, మీ సేవ లేదా ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌ల ద్వారా చెల్లించవచ్చన్నారు.

నేడు మిషన్ ఇంద్రధనస్సు

ఐ.పోలవరం: మిషన్ ఇంద్ర ధనస్సులో భాగంగా మండలంలోని నాలుగు గ్రామాల్లో బుధవారం గర్భిణులు, ఐదేళ్ల లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని వైద్యురాలు డి.ఇందిరాశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జి.వేమవరం పీహెచ్‌సీ పరిధిలోని టి.కొత్తపల్లి(అడవి పేట), పాతయింజరం, ఎదుర్లంక, జి.మూలపాలెం(యర్రగరువు) గ్రామాల్లో వ్యాక్సిన్‌లు వేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు.

పోలీస్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఆహ్వానం

యానాం: నేషనల్ సెక్యూరిటీ అండ్ పోలీస్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీలో పుదుచ్చేరి క్యాంపస్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను వివిధ కోర్సుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిప్లొమో ఇన్ పోలీస్, బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ ఇన్ క్రిమినాలజీ అండ్ పోలీస్ అడ్మినిస్ట్రేషన్, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమో ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్, ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్, సెక్యూరిటీ అండ్ ఇంటిలిజెన్స్ మేనేజ్‌మెంట్ కోర్సులు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 916357 244804కు ఫోన్ చేయాలని కోరారు.

రేషన్ డిపోల్లో తనిఖీలు



బండారులంకలో రేషన్ డిపోను తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్

అమలాపురం రూరల్: రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ మంగళవారం బండారులంకలో పలు రేషన్ డిపోలను తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా కాపటివారివీధిలో ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 750 కేజీల రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. ఆయన వెంట వీఆర్వో ప్రకాష్ తదితరులున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం పేదలకు సక్రమంగా అందించాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహాసభను విజయవంతం చేయాలి

అమలాపురం రూరల్: ఈ నెల మూడో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉభయగోదావరి జిల్లాల సమన్వయకర్త ముమ్మిడివరం చిన్న సుబ్బారావు, జిల్లా ఇన్‌చార్జ్ వల్లూరి సత్తిబాబు, జిల్లా అధికార ప్రతినిధి ఆకుమర్తి మోహన్ మాదిగలు పిలుపునిచ్చారు. మంగళవారం రోళ్ళపాలెంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సవరపు భైరవమూర్తి, జిల్లా ప్రచార కార్యదర్శి లంక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

యానాం: యానాంలో 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ లంక కృష్ణారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయిరాంనగర్, సంతోష్‌నగర్, బ్రహ్మానందనగర్, గోపాల్‌నగర్, శ్రీరామ్‌నగర్, భీమ్‌నగర్, యూకేవీనగర్, కనకాలపేట, అగ్రహారం, బెజవాడా గార్డెన్స్, కొత్తపేట, టీచర్స్ కోలనీ, విష్ణాలయం వీధి, శివాలయం వీధి, పైడికొండల వీధి, గుమ్మళ్ల లేన్, ఫ్రాన్స్ తిప్ప, ఓల్డ్ రాజీవ్‌నగర్, సాలికోట ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ ఉండదన్నారు.

ఇంటింటికీ వెళ్లి.. భరోసా కల్పించి..



ముమ్మిడివరం మండలంలో వరద బాధితులనుద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పినిపే విశ్వరూప్, వేణు, తానేటి వనిత, జోగి రమేష్, ఎమ్మెల్యేలు పొన్నాడ సతీష్, జగ్గిరెడ్డి, చిట్టిబాబు, కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు



వృద్ధురాలితో మాట్లాడుతున్న సీఎం



రైతులను వరద తెచ్చిన కష్టాలు అడిగి తెలుసుకుంటూ..

- లంక గ్రామాల్లో సీఎం జగన్ విస్తృత పర్యటన
- అన్ని విధాలా ఆదుకుంటానంటూ బాధితులకు హామీ
- లంక గ్రామాలకు రక్షణ కవచం కోసం రూ.150 కోట్లు మంజూరు

ముమ్మిడివరం, తాళ్లరేవు: గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలైన లంక గ్రామాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విస్తృతంగా పర్యటించి బాధితులకు భరోసా కల్పించారు. ముమ్మిడివరం మండల పరిధిలోని గురజాపులంక, కూనాలంక, లంకాఫ్ ఠానేలంక, అయినవిల్లి మండల పరిధిలోని పొట్టిలంక గ్రామ పంచాయతీల్లో ముఖ్యమంత్రి సుమారు ఆరు గంటల పాటు పర్యటించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అడుగడుగునా నీరాజనం పట్టారు. ఇంటింటికీ వెళ్లి వరద బాధితులను ఆత్మీయంగా పలకరిస్తూ అధైర్య పడాల్సిన పనిలేదని, మీ బిడ్డగా మీకు అండగా ఉన్నానంటూ భరోసా కల్పించారు. ప్రభుత్వం ద్వారా పంపిన నిత్యావసర సరకులు, ఆర్థిక సాయం అందాయా అని బాధితులను ఆరా తీశారు.

నెల రోజుల్లోగా నష్ట పరిహారం

కూనాలంక, లంకాఫ్ ఠానేలంకలోని రామాలయం పేట గ్రామాల్లో బాధితులనుద్దేశించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరి నుంచి 16 లక్షల క్యూసెక్కులు నీరు విడుదల కావడంతో వరద సంభవించిందన్నారు. వరదల సమయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారానే మీకు సత్వర సేవలు అందించగలిగామన్నారు. తాటాకు ఇళ్లకు స్వల్ప నష్టం కలిగినా రూ.10 వేలు కచ్చితంగా ఇవ్వాలని ఆదేశాలిచ్చామన్నారు. నష్టపోయిన పంటలకు వెంటనే ఏ సీజన్‌లో నష్టం జరిగితే అదే సీజన్‌లోనే నష్ట పరిహారం అందిస్తున్నామని చెప్పారు. పంట నష్ట అంచనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారని, జాబితాలను ఆర్‌బీకేల్లో పెడతారన్నారు. ఎవరి పేరైనా రాకపోతే మరోసారి పరిశీలించి అర్హులందరికీ నష్ట పరిహారం అందజేస్తామని చెప్పారు. కేవలం నెలరోజుల్లోగా పంట నష్ట పరిహారం అందజేస్తామని ప్రకటించారు.

రివిట్‌మెంట్‌కు సీఎం హామీ

గోదావరి వరదల కారణంగా కోతకు గురవుతున్న లంక గ్రామాల్లో రివిట్‌మెంట్‌ల నిర్మాణానికి రూ.150 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. అయినవిల్లి మండలం పొట్టిలంకలో వెయ్యి మీటర్లు, ముమ్మిడివరం మండలం ఠానేలంకలో 400 మీటర్లు, గురజాపులంకలో 600 మీటర్లు, కూనాలంకలో 800 మీటర్లు, కొండకుదురు లంకలో 400 మీటర్లు, వివేకానంద వారధి వద్ద 300 మీటర్లు రివిట్‌మెంట్ నిర్మించడానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పదిరోజుల్లో అంచనాలు సిద్ధం చేసి టెండర్‌లు పిలుస్తామని, కేవలం రెండు నెలల్లోగా పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

సీఎం జగన్‌కు ఘన స్వాగతం

మంగళవారం ఉదయం 10.10 గంటలకు కమిని పంచాయతీ పరిధిలోని గురజాపులంకలోని హెలిపాడ్ వద్దకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేరుకున్నారు. సీఎం వెంట రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, సీఎం ముఖ్య సలహాదారుడు ధనుంజయరెడ్డిలు వచ్చారు. రాష్ట్ర మంత్రులు పినిపే విశ్వరూప్, జోగి రమేష్, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం ఎంపీ చింతా అనూరాధ, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు, పిఠాపురం ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, కొండేటి చిట్టిబాబు, రాపాక వరప్రసాద్, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, డీఐజీ అశోక్‌కుమార్, జేసీ నపూర్ అజయ్‌కుమార్ తదితరులు సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రివిట్మెంట్ నిర్మించి మా గ్రామాన్ని కాపాడాలి



గతంలో గ్రామానికి సుమారు వంద మీటర్ల దూరంలో గోదావరి ఉండేది. ఏటిగట్టు కోతకు గురై నది ప్రస్తుతం మా ఊరి చెంతకు వచ్చేసింది. గ్రామంలోని పక్కా ఇళ్లు సైతం నదిలో కలిసిపోతున్నాయి. తక్షణమే రివిట్మెంట్ నిర్మించి మా ఊరిని కాపాడాలని కోరుకుంటున్నాం.
– కొప్పిశెట్టి లీలా పద్మజ, లంకాఫ్ ఠానేలంక గ్రామం

పంట నష్టపరిహారం అందించాలి



మా గ్రామంలో కాయగూరలు, ఆకుకూరలు అధికంగా పండిస్తాం. వరదల వల్ల ఆయా పంటలు నీట మునిగి తీవ్ర నష్టం వచ్చింది. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.
– కొప్పిశెట్టి విజయలక్ష్మి, లంకాఫ్ ఠానేలంక

సీఎంకు రుణపడి ఉంటాం



వరదల సమయంలో మాకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు కంటికి రెప్పలా కాపాడారు. ముఖ్యంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తమకు బియ్యం, నిత్యవసరాలు అందజేశారు. అలాగే రూ.2 వేల నగదును కూడా బాధితులందరికీ అందించారు. అడగకుండానే అన్నీ చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.
– మందపల్లి సుబ్బలక్ష్మి, రామాలయంపేట, ముమ్మిడివరం మండలం

అన్నీ ఇచ్చి ఆదుకున్నారు



ఏటా వరదలకు మా గ్రామం ముంపు బారిన పడుతుంది. గత ప్రభుత్వం ఎప్పుడూ వచ్చి ఆదుకున్న పాపాన పోలేదు. కాని జగన్ ప్రభుత్వంలో వరదలొస్తే అధికారులు ఆగమేఘాల మీద మా ఊరొచ్చి భోజన వసతి, నిత్యావసర సరకులు, తాగునీరు అందించి ఆదుకుంటున్నారు. రూ.2 వేలు ఆర్థిక సాయం చేశారు. ఇప్పుడు జగనన్నే స్వయంగా మా ఊరిచ్చి మమ్మలను ఓదార్చడం మాకెంతో ఆనందాన్నిస్తుంది.
– పంపాని దుర్గ, గురజాపులంక, ముమ్మిడివరం మండలం

రివిట్‌మెంట్ నిర్మించాలి



గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మాకిచ్చిన పట్టా భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాం. అయితే ఇప్పుడవి నదీ ప్రవాహానికి కోతకు గురవుతున్నాయి. అలాగే మా గ్రామంలో అనేక ఇళ్లు కోతకు గురై నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. మా గ్రామం చుట్టూ రివిట్‌మెంట్ సౌకర్యం కల్పించాలి.
– మోర్త మంగాలక్ష్మి, గురజాపులంక

ఆదుకుంటామని అభయమిచ్చారు



నాకున్న ఎకరం పొలంలో రూ.50 వేల పెట్టుబడితో బెండ, మిర్చి పంట సాగు చేశాను. వరద వల్ల పంట దెబ్బతిని కుళ్లిపోయింది. మా గ్రామానికి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మా గోడు వెల్లబుచ్చుకున్నాం. ఈ నెలాఖరులోగా నష్ట పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు.
– బొక్కా వీర వెంకట సత్యనారాయణ, కూనాలంక, ముమ్మిడివరం మండలం

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విలసవిల్లిలో గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి



గర్భిణులకు టేక్ హోమ్ రేషన్ సరుకులను అందిస్తున్న సీడీపీఓ కుమారి, సర్పంచ్ విజయలక్ష్మి

ఉప్పలగుప్తం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులకు సర్పంచ్ ఊర్మిళాదేవి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, సవరపు మీరాబాయి, పెట్ట బాలామణి, కొమ్మాబత్తుల అరుణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

అల్లవరం: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ కేవీఎల్‌డీ కుమారి అన్నారు. సర్పంచ్‌లు బర్రే సీతారత్నం, తోట శ్రీదేవి, తిక్కిరెడి శ్రీనివాసరావు, రొక్కాల విజయలక్ష్మిల అధ్యక్షతన బెండమూర్లంక, గోడి, ఎంట్రుకోన, బోడసకుర్రు గ్రామాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గర్భిణులకు సీమంతం నిర్వహించి పండ్లు, చీరలు, వైఎస్సార్ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కాండ్రేగుల వాణి అచ్యుతం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయభారతి, ఉన్నీషా, కుమారి, అడపా శ్రీను, జలి రాధాకృష్ణ, తోట నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'నా భూమి–నా దేశం'

ఐ.పోలవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9 నుంచి 15 వరకూ 'నా భూమి–నా దేశం' 'నేల తల్లికి వందనం–వీరులకు వందనం' ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించాలని ఎంపీడీఓ డి.రాంబాబు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు.

యానాం: యానాం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి 15 వరకూ 'నా భూమి – నా దేశం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రకాశం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో మా తెలుగుతల్లికి మల్లెపూదండ, లైటింగ్ ఆఫ్ ల్యాంప్, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేతుల మీదుగా శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 10న ప్రతిజ్ఞ, 11న మొక్కల నాటడం, 14న స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులకు సత్కారం, 15న జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఆరోగ్యం, పోషకాహారంపై ఒక రోజు శిక్షణ



కేశవదాసుపాలెంలో పోషకాహారంపై సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో రమాదేవి

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం తుఫాను షెల్టర్‌లో మంగళవారం ఓఎన్జీసీ సహకారంతో సిటిజన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మండలంలోని అంగన్‌వాడీ సెంటర్ల కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు ఆరోగ్యం, పోషకాహారంపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. స్థానిక సర్పంచ్ మేడిది సరోజ అధ్యక్షతన జరిగిన పై కార్యక్రమాన్ని సిటిజన్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ కె.రమేష్ పర్యవేక్షించారు. కుక్ ప్లాంటేషన్ ద్వారా ఆకుకూరలు, కూరగాయలు పండించి, తద్వారా పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు స్వచ్ఛమైన ఆహారం అందించే విధంగాను, పలు అంగన్‌వాడీ సెంటర్లకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు రమేష్ అన్నారు. అలాగే ఆరోగ్యం, పోషకాహారం అంశాలపై ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. డాక్టర్ యునస్, ఎంపీటీసీ ఉండపల్లి సాయికుమారి, సిటిజన్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ టి.రమాదేవి, కార్యదర్శి డి.సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

పి.గన్నవరం: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని వై.కొత్తపల్లి సర్పంచ్ తోరం వీవీ సత్యనారాయణ అన్నారు. గ్రామ సచివాలయం కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో రైతులకు మంగళవారం ఆయన పీడీఎంఎస్ విత్తనాలను, ఎస్‌టూఎస్ కిట్లను పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయంతో చేనుతో పాటు, మనకు మంచి ఆరోగ్యం సమకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆకుల వీరబాబు, సరెళ్ల సత్యనారాయణ, కడలి విజయకుమారి, గోగి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తీర్థం

అంబాజీపేట: నందంపూడిలో వేంచేసిన ముత్యాలమ్మ అమ్మవారి తీర్థాన్ని మంగళవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వైభవంగా నిర్వహించారు. గ్రామ ఆడపడుచులు కుంకుమ పూజలు, చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు, నైవేద్యాలను చెల్లించి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం రాత్రి జాతరలో ఏర్పాటు చేసిన గరగ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. వచ్చే ఆదివారం అమ్మవారి జలకాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రజల గుండెల్లో చెరగని ముద్ర



గద్దర్ సంస్మరణ సభలో పాల్గొన్న నాయకులు

యానాం: ప్రజా గాయకుడు గద్దర్ తన పాటలతో ఉద్యమాలకు ఊపిరిలూది ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని భారతీయ దళిత సాహిత్య అకాడమీ సౌత్‌ఇండియా స్టేట్స్ కమిటీ అధ్యక్షుడు పానుగుమట్ల విష్ణుమూర్తి పేర్కొన్నారు. మంగళవారం అంబేడ్కర్‌నగర్ బుద్ధాపార్క్‌లో నిర్వహించిన గద్దర్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి దాట్ల దేవదానం రాజు మాట్లాడుతూ గద్దర్ తన ఉద్యోగానికి రాజీనామా చేసి జననాట్య మండలి ద్వారా కాళ్లకు గజ్జెలు కట్టుకుని అన్నిచోట్లకు వెళ్లి అసమానత్వం, అణచివేతలకు వ్యతిరేకంగా గళం విప్పారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్‌ఏఓ నామాడి అప్పారావు, దళిత నాయకులు తిరుకోటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి లబ్ధిదారునికీ పథకాలు చేరాలి



అంబాజీపేటలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఉన్న సచివాలయం –1ను ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కె.సత్యనారాయణలు మంగళవారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే లబ్ధిదారులకు ఉద్యోగులు సహకరించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సచివాలయంలో సాయంత్రం నిర్వహించే స్పందనకు వచ్చిన దరఖాస్తుల వివరాలను నమోదు చేయడంతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ విద్యార్థులు లేకపోవడంతో అంగన్‌వాడీ టీచర్‌ను, ఆయాను అడిగి తెలుసుకున్నారు. ప్రతి చిన్నారికీ, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. కేంద్రానికి వచ్చే చిన్నారులకు ఆటపాటలతో పాఠాలు బోధించాలన్నారు.

బ్రహ్మాస్త్రంతో చీడపీడల నివారణ

అంబాజీపేట: పంటలను పట్టి పీడిస్తూ దిగుబడులకు నష్టం కల్గిస్తున్న చీడపీడలను బ్రహ్మాస్త్రంతో నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్ జనుపల్లి నాగవేణి అన్నారు. ముక్కామలలో బ్రహ్మాస్త్రం తయారీ విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నాగవేణి మాట్లాడుతూ ఉమ్మెత్త ఆకు 5 కేజీలు, జామ 5 కేజీలు, సీతాఫలం ఆకు 5 కేజీలు, బొప్పాయి ఆకు 5 కేజీలు, వేపాకు 5 కేజీలు సేకరించాలన్నారు. ఈ ఆకులు అన్ని విడివిడిగా దంచి 70 లీటర్ల చేసి, ఆవు మూత్రంలో వేసి 5 పొంగులు వచ్చే వరకు ఉడికించాలన్నారు. ఇలా తయారు అయిన ఈ కషాయాన్ని 48 గంటల తర్వాత వాడుకోవాలన్నారు. ఒక ఎకరానికి 5 లీటర్ల చొప్పున 100 లీటర్ల నీటితో కలిపి స్ప్రే చేసుకోవాలన్నారు. ఇలా స్ప్రే చేయడం వలన పంటపై ఆశించిన పురుగులు, గొంగళి పురుగులు, కాండం తొలచు పురుగు, కాయ తొలచు పురుగులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ముక్కామల ఐసీఆర్పీ కొప్పిశెట్టి మల్లీశ్వరి, జి. పల్లయ్య, ఎస్‌జీహెచ్ మహిళలు, రైతులు పాల్గొన్నారు.

లారీ టైరు పేలి అంటుకున్న మంటలు



మంటలను అదుపు చేస్తున్న ఫైర్, హైవే సిబ్బంది

రావులపాలెం: జాతీయ రహదారిపై వెళుతున్న ఒక లారీ వెనుక టైరుపేలి మంటలు అంటుకున్నాయి. స్థానిక జూనియర్ కళాశాల సమీపంలో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కలకత్తా నుంచి చెన్నై వెళుతున్న కూలింగ్ కంటైనర్ లారీ జూనియర్ కళాశాల జంక్షన్ వద్దకు వచ్చే సరికి వెనుక ఎడమవైపు ఉన్న టైరు పేలడంతో లారీ డ్రైవర్ బండిని పక్కన ఉన్న సర్వీసు రోడ్డులో ఆపాడు. ఇంతలో ఆ టైర్లకు మంటలు అంటుకోవడంతో స్థానికులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది, కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన ప్రాంతానికి చేరుకుని టైర్లకు అంటుకున్న మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 వేల వరకూ నష్టం జరిగినట్టు ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ తెలిపారు.

ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: రైతు సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోభివృద్ధి చెందాలని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో ఆర్బీకే చైర్మన్ వాసంశెట్టి వెంకటరమణ అధ్యక్షతన ఆర్బీకేలకు వచ్చిన 225 యూరియా బస్తాలను మంగళవారం రైతులకు అందజేశారు. కార్యక్రమంలో వీపీఏ సౌజన్య, రైతులు పాల్గొన్నారు.


రహదారిపై రాష్ట్రపతి కాన్వాయ్‌కు సడన్ బ్రేక్



చిన్నారులకు చాక్లెట్లు ఇస్తున్న రాష్ట్రపతి ముర్ము

యానాం: పుదుచ్చేరి పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము రహదారిపై తన కాన్వాయ్‌ని ఆపించి కారు దిగి తన కోసం వేచి చూస్తున్న చిన్నారుల వద్దకు వెళ్లి చాక్లెట్లను అందించిన ఘటన అందరినీ అబ్బురపరిచింది. మంగళవారం తిరుకంచి వద్ద దర్శనం చేసుకుని తిరిగి వెళుతుండగా అభిషేకపాకం వద్దకు వచ్చేసరికి రాష్ట్రపతి కారుకు సడన్‌బ్రేక్ పడింది. దీంతో ఏం జరిగిందోనని భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఇంతలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కారు దిగి రోడ్డుపక్కన ఉన్న చిన్నారుల వద్దకు వెళ్లి వారితో ముచ్చటించి చాక్లెట్లు అందజేయడంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు చిత్రాంజలి



ఉపాధ్యాయుడు చంద్రకుమార్ వేసిన గద్దర్ చిత్రం

అమలాపురం రూరల్: మండలంలోని పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వాటర్ కలర్స్‌తో గద్దర్ చిత్రాన్ని వేసి ఆయనకు చిత్రాంజలి ఘటించారు.

బాలికల ఆర్థిక సహాయ పథక నిబంధనలు విడుదల

యానాం: అప్పుడే పుట్టిన బాలికలకు ఆర్థిక సాయం అందించే పథకానికి సంబంధించి నిబంధనలను పుదుచ్చేరి ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా మార్చి 17, 2023 తర్వాత జన్మించిన ఆడశిశువులకు సీఎం కేర్స్ పథకం ద్వారా రూ.50 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో ఒకేసారి జమ అవుతాయన్నారు. బాలిక జన్మించిన 90 రోజుల్లోగా సుకన్య సమృద్ధి యోజన పోస్టాఫీసు, బ్యాంకు అకౌంట్లలో సదరు మొత్తాన్ని జమ చేస్తారన్నారు. బాలికకు 21 ఏళ్లు వచ్చేటప్పటికి మెచ్యూరిటీ మొత్తం అందుతుందన్నారు.